## అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తుకు ఆస్కారం లేదు..


న్యూఢిల్లీ, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికలకు అధికార ఆప్ సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను కూడా ప్రకటిస్తోంది. ఇప్పటికే రెండు విడతల్లో మొత్తం 31 మందిని ప్రకటించింది. ఇక ఈ ఎన్నికల్లో ఆప్ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకునే ఆస్కారం లేదని స్పష్టం చేశారు.'ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఒంటరిగానే బరిలోకి దిగుతుంది. సొంత బలంతో ఎన్నికల్లో గెలుపొందుతుంది. కాంగ్రెస్‌తో ఎలాంటి పొత్తుకూ అవకాశం లేదు' అని కేజ్రీ వెల్లడించారు. కాగా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆప్ సీట్ల పంపకం కోసం ఇండియా కూటమిలోని ఇతర భాగస్వామ్య పార్టీలతో చర్చలు జరుపుతోందంటూ వార్తలు వస్తున్నాయి. కూటమిలోని కాంగ్రెస్‌కు 15 సీట్లు, ఇతర పార్టీలకు ఒకటి లేదా రెండు సీట్లు కేటాయించినట్లు సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియాలు వార్తలు వస్తున్నాయి. ఈ వార్తలపై స్పందించిన కేజ్రీ.. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పష్టతనిచ్చారు.


# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :251 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 12-12-2024 | పేజీలు:4 వెల: 2.00


# రేవంత్ రెడ్డి వ్యూహాన్ని బీఆర్ఎస్ ముందే పసిగట్టిందా?




హైదరాబాద్,మొత్తానికి తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణపై రాద్ధాంతం చేస్తున్న బీఆర్ఎస్‌కు అసెంబ్లీ సాక్షిగా షాక్ ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్లాన్ చేస్తే.. చివరి నిమిషంలో తప్పించుకున్నారనే చర్చ జరుగుతోంది.పార్టీలకైనా, వ్యక్తులకైనా విమర్శలు, ఆరోపణలు, నిందలు వందలుగా వస్తూనే ఉంటాయి. కానీ ఒకే ఒక లాజిక్ పాయింట్ వాటన్నింటిని పటాపంచలు చేసే బ్రహ్మాస్త్రం అవుతుంది.. అలాంటి పవర్‌ఫుల్ అస్త్రాన్ని ప్లాన్ చేసుకున్నారట సీఎం రేవంత్ రెడ్డి. తెలంగాణ తల్లి విగ్రహ వివాదంపై అసెంబ్లీ సాక్షిగా ప్రతిపక్షాల నోరుమూయించేందుకు ఈ అస్త్రన్ని సంధించాలనుకున్నారట. ముందే గ్రహించిన బీఆర్ఎస్ దీంతో రూట్ మార్చిందంట.. ఇంతకీ రేవంత్ రెడ్డి లాజిక్ పాయింట్ ఏంటి? గులాబీ నేతలు ఎందుకు డైవర్షన్ పాలిటిక్స్ ఏంటి..? జస్ట్ వాచ్ ఇట్..

అదే లాజిక్‌తో అసెంబ్లీలో బీఆర్ఎస్‌ను కార్నర్?

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాజిక్ పాయింట్ అదిరిపోయిందా? అదే లాజిక్‌తో అసెంబ్లీలో బీఆర్ఎస్‌ను కార్నర్ చేయాలనుకున్నారా? అంటే అవుననేది పొలిటికల్ సర్కిల్స్ టాక్.. ఐతే చివరి నిమిషంలో మ్యాటర్ లీకై బీఆర్ఎస్ ట్విస్ట్ ఇచ్చిందని తెలుస్తోంది.. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణపై కొన్నాళ్లుగా రాద్ధాంతం చేస్తున్న బీఆర్ఎస్‌కు అసెంబ్లీ వేదికగా దీటుగా సమాధానం చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి భావించారట.పదేళ్లు పవర్‌లో ఉండి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు అధికారికంగా ఏర్పాటు చేయలేదని కడిగిపారేయాలనుకున్నారని సమాచారం. ఐతే విషయం ముందే గ్రహించి ప్రభుత్వమే తమను అసెంబ్లీకి రాకుండా అడ్డుకునేలా పథకం ప్రకారం తప్పించుకున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.భరతమాత, తెలుగు తల్లి, తెలంగాణ తల్లి.. ఈ విగ్రహ రూపాలు భావోద్వేగాలకు ప్రతీకలు. మన సంస్కృతికి అద్దంపట్టే వేదికలు. ఐతే తెలంగాణలో మాకో తల్లి, మీకో తల్లి అన్నట్టు పరిస్థితి మారిపోయింది. బీఆర్ఎస్ హయాంలో ఉన్న తెలంగాణ తల్లి రూపాన్ని మార్చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. తల్లి విగ్రహం మారడంతో రాష్ట్ర రాజకీయాల్లో మాటల మంటలు చెలరేగుతున్నాయి. అది మూమ్మాటికీ కాంగ్రెస్ తల్లి అంటూ ప్రతిపక్షాలు గగ్గోలుపెడుతున్నాయి.ప్రతిపక్షాల కామెంట్స్‌కు అసెంబ్లీ వేదికగా అదిరిపోయే సమాధానమిచ్చారు సీఎం రేవంత్ రెడ్డి.. ఇప్పటి వరకు రాష్ట్రంలో అధికారికంగా గుర్తించిన తెలంగాణ తల్లి విగ్రహం లేదనే విషయాన్ని కుండబద్ధలు కొట్టారు. ఉద్యమం నాటి నుంచి బీఆర్ఎస్ రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహమే ప్రాచుర్యంలో ఉందని తేల్చిచెప్పారు. కానీ ఎక్కడా ఇప్పటి వరకు అధికారికంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయలేదని తేల్చి చెప్పారు.

సెంటిమెంట్‌ను తట్టిలేపాలనుకున్న బీఆర్ఎస్?

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అసెంబ్లీలో కడిగిపారేయాలని మొదట బీఆర్ఎస్ భావించిందట. మరోసారి తెలంగాణ సెంటిమెంట్‌ను తట్టిలేపాలని భావించారట. కానీ సీఎం రేవంత్ రెడ్డి లాజిక్ పాయింట్ గురించి ముందే తెలుసుకున్న బీఆర్ఎస్.. సైలెంట్‌గా వెనుకడుగు వేసింది. పదేళ్లలో తల్లి విగ్రహాన్ని ఎందుకు అధికారికంగా ఏర్పాటు చేయలేదని ప్రభుత్వం ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సి వస్తుంది.. ఒకవేళ అసెంబ్లీకి హాజరుకాకుంటే అధికార పార్టీ నేతలు విమర్శలు గుప్పిస్తారు.పొలిటికల్‌గా కార్నర్ కావాల్సి వస్తుంది.. అందుకే బీఆర్ఎస్ లీడర్స్ డైవర్షన్ గేమ్ ప్లాన్ చేశారని పొలిటికల్ టాక్.. అందుకే చివరి నిమిషంలో సీఎం రేవంత్, అదానీ కలసి ఉన్న ఫోటోలతో కూడిన టీషర్ట్‌లు వేసుకుని అసెంబ్లీ బాట పట్టారు. నిజానికి విగ్రహ వివాదం వేళ.. అదానీ అంశంతో సంబంధమే లేదు. బీఆర్ఎస్ నేతలు పాత తెలంగాణ తల్లి విగ్రహం ఫోటోతో ఉన్న టీషర్టులు వేసుకొచ్చినా.. నిరసనలా ఉండేది. కానీ అదానీ ఫోటోతో ఉన్న టీషర్టులతో రావడంతో అసెంబ్లీకి నో ఎంట్రీ బోర్డు పెట్టారు పోలీసులు.. దీంతో తమ డైవర్షన్ ప్లాన్ వర్కవుట్ అయ్యిందని, పైగా తమను అసెంబ్లీకి రానివ్వలేదని కౌంటర్ ఎటాక్ చేసే ఛాన్స్ దొరికిందని బీఆర్ఎస్ వర్గాలు భావిస్తున్నాయనేది పొలిటికల్ సర్కిల్స్ డిబేట్.మొత్తానికి తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణపై రాద్ధాంతం చేస్తున్న బీఆర్ఎస్‌కు అసెంబ్లీ సాక్షిగా షాక్ ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్లాన్ చేస్తే.. చివరి నిమిషంలో తప్పించుకున్నారనే చర్చ జరుగుతోంది. ఎవరి ప్లాన్ ఎలా ఉన్నా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు సభలో లేవనెత్తిన అంశాలపై బీఆర్ఎస్ ఆలోచనల్లో పడిందని తెలుస్తోంది. గత పదేళ్ల పాలనలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు అధికారికంగా ఏర్పాటు చేయలేకపోయామనే పునరాలోచనలో పడిపోయారట గులాబీ పెద్దలు.. ఇదే సమయంలో అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్‌ను ఇరుకున పెట్టాలనుకున్న సీఎం రేవంత్ రెడ్డి ప్లాన్ జస్ట్ మిస్ అయ్యిందనే చర్చ జరుగుతుంది.

# తెలంగాణలో ఉత్తమ శాసనసభ వక్త అవార్డు: శ్రీధర్ బాబు



హైదరాబాద్: శాసనసభ అంటే అందరిదీ.. ఏ ఒక్క పార్టీకి చెందినది కాదన్నారు మంత్రి శ్రీధర్ బాబు. కొత్తగా శాసనసభకు ఎన్నికైన నేతలందరూ సభకు హాజరయ్యే సంప్రదాయం కొనసాగించాలని కోరారు. సిద్ధాంతపరంగా బేధాలున్నప్పటికీ.. సభలో ఎవరి పాత్ర వాళ్లు పోషించాలన్నారు.శాసనసభ వ్యవహారాలపై తెలంగాణ శాసనసభ, మండలి సభ్యులకు బుధ, గురువారాల్లో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ..'మొదటి సారి ఎన్నికైన శాసనసభ్యులు 57 మంది శాసన సభలో ఉన్నారు. శాసన సభ అందరిది.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలో మరొక పార్టీదో కాదు. ఈ ట్రైనింగ్ సెషన్స్ కోసం అందరికీ ఆహ్వానం పంపించాము.పాత రోజుల్లో సిద్ధాంత పరంగా భేదాభిప్రాయాలు ఉన్నా సభలో ఎవరి పాత్ర వారు పోషించారు. నేను మొదటిసారి ఎన్నికైనప్పుడు కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉంది. నేను నాలుగోసారి సభలో ఉన్నప్పుడు పీఏసీని ప్రతిపక్షానికి ఇవ్వలేదు. ఎమ్మెల్యేలు అందరూ శాసనసభకు హాజరయ్యే సాంప్రదాయం కొనసాగించాలి. ఎమ్మెల్యేగా గెలిచి సభ రాకుండా దూరంగా ఉండకండి. పార్లమెంట్‌లో ఎలాగైతే ఉత్తమ పార్లమెంటేరియన్ ఇస్తున్నారో అదే విధంగా ఉత్తమ శాసనసభ వక్త అవార్డు ఇవ్వాలని స్పీకర్‌ను కోరుతున్నాం' అంటూ కామెంట్స్ చేశారు.స్పీకర్ గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ..'చట్టాలను రూపొందించే హక్కు శాసన సభ్యులకు ఉంటుంది. గతంలో శాసనసభ సమావేశాలు ఉంటే సినిమా రిలీజ్ వాయిదా వేసుకునే వారు. ఎన్టీఆర్, వైఎస్ రాజశేఖర్ రెడ్డి లాంటి గొప్ప వ్యక్తులు బాగా మాట్లాడి మంచి పేరు తెచ్చుకున్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్ మాదిరిగా ఉత్తమ శాసనసభ వక్త అవార్డు పరిశీలన చేస్తాం' అంటూ చెప్పుకొచ్చారు. తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ..'గాలివాటం రాజకీయాలు ప్రారంభం అయినప్పటికీ కొత్త వాళ్ళు మళ్ళీ గెలవడం లేదు. మొదటిసారి ఎన్నికై రాజకీయాల్లో సక్సెస్ అయ్యే వారి శాతం 25శాతమే. కొందరు నాయకులు గెలిచాక ప్రజలతో మమేకం కావడం లేదు. ఎమ్మెల్యేకు కోటరీ వల్ల ప్రజలు స్వయంగా ఎమ్మెల్యేను కలిసే అవకాశం ఎక్కువగా ఉండదు. ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉండాలి.. ఫోన్లు ఎత్తాలి. నేను ఒకసారి ఓడిపోవడానికి నాకు సెక్యూరిటీ సమస్య వల్లే. ప్రజలు ఎమ్మెల్యేకు దూరం అవ్వడానికి కారణం పీఏలు, పీఆర్వోలు అంటూ కామెంట్స్ చేశారు.

# 2035 నాటికి భారత్‌కు సొంత స్పేస్ స్టేషన్




న్యూఢిల్లీ, డిసెంబర్11: 2035 నాటికి భారత్‌కు సొంత స్పేస్ స్టేషన్ ఉంటుందని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ వెల్లడించారు. సొంతంగా అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించుకోబోతున్నామన్నారు. అలాగే, 2040 నాటికి చంద్రుడిపై భారతీయుడు కాలుమోపుతారన్నారు. ఫిబ్రవరి 27న తిరువనంతపురంలో గగన్‌యాన్ మిషన్‌ను సంబంధించిన వ్యోమగాముల పేర్లను ప్రకటించిన అనంతరం.. ప్రధాని నరేంద్ర మోదీ 2035 నాటికి భారత్‌కు సొంత స్పేస్ స్టేషన్ ఉంటుందని చెప్పారు. ఇప్పుడు ఈ కల త్వరలోనే నెరవేరబోతున్నది. ప్రస్తుతం దేశాలకు స్పేస్‌స్టేషన్స్ ఉన్నాయి. భారత్ సొంతంగా అంతరిక్ష కేంద్రాన్ని నిర్మిస్తే.. చారిత్రాత్మక విజయంతో పాటు సొంత స్పేస్‌స్టేషన్ ఉన్న మూడోదేశంగా నిలువనున్నది. భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ భారత్ స్పేస్ స్టేషన్ కోసం ప్రణాళికలు రూపొందించింది. 52 టన్నుల బీఏఎస్ తొలుత ముగ్గురు వ్యోమగాములు వెళ్లొచ్చు. భవిష్యత్‌లో దాని సామర్థ్యాన్ని ఆరుకి పెంచే యోచనలో ఉన్నది. బెంగళూరులోని యూఆర్‌రావు శాటిలైట్ సెంటర్‌లో జరిగిన కన్నడ సాంకేతిక సదస్సులో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడయ్యాయి. బీఏఎస్ అనేది లైఫ్ సైన్సెస్, మెడిసిన్ రంగాల్లో శాస్త్రీయ పరిశోధనలకు మద్దతు ఇచ్చేందుకు, అంతరిక్ష పరిశోధనలను మెరుగుపరిచేందుకు భారత్ అభివృద్ధి చేస్తున్న మాడ్యులర్ స్పేస్ స్టేషన్. తొలి మాడ్యుల్ 2028లో ఎల్‌వీఎం3 వాహకనౌక ద్వారా ప్రారంభించనున్నట్లు భావిస్తున్నారు. నాలుగు సంవత్సరాల తర్వాత స్పేస్‌స్టేషన్ రూపుదిద్దుకుంటుంది. స్పేస్‌స్టేషన్ మాడ్యుల్స్‌ని పలు దశల్లో నింగిలోకి పంపి.. ఆ తర్వాత అంతరిక్షంలోనే వాటిని అనుసంధానిస్తారు. 2035 నాటికి స్పేస్‌స్టేషన్ పూర్తవుతుంది. ప్రస్తుతం విశ్వంలో ఒకే స్పేస్‌స్టేషన్ ఉన్నది. దీన్ని నానా అనేక దేశాల సహకారంతో నిర్మించింది. ప్రస్తుతం చైనా సైతం సొంతంగా ఇంటర్‌నేషనల్ స్పేస్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నది. భారత్ సైతం బీఎస్‌ఏని నిర్మిస్తే మూడోదేశంగా నిలువనున్నది. ఈ స్టేషన్‌కు భారత అంతరిక్ష కేంద్రంగా నామకరణం చేశారు. ఇది భవిష్యత్తులో అంతరిక్ష యాత్రల కోసం మైక్రోగ్రావిటీ, మానవ ఆరోగ్యం, లైఫ్ సస్టెయినింగ్ టెక్నాలజీస్‌పై అధ్యయనానికి అనుమతి ఇస్తుంది. అమెరికా, చైనా దేశాలు ఇప్పటికే తమ వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపుతున్నాయి. తాజాగా ఆ జాబితాలో భారత్ పేరు సైతం చేరనున్నది. ఈ ప్రాజెక్ట్ లక్ష్యం యువ శాస్త్రవేత్తలను ప్రేరేపించడంతో పాటు అంతరిక్షరంగంలో కొత్త వ్యాపార అవకాశాలను సృష్టించడం. చంద్రయాన్-1తో చంద్రుడిపై తొలిసారిగా నీటిజాడలను గుర్తించింది. ఆ తర్వాత చంద్రయాన్-3తో దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలిదేశంగా ఇస్రో నిలిచింది. భారత్ స్పేస్ స్టేషన్ సైతం గర్వకారణంగా నిలువనున్నది. అదే సమయంలో అంతరిక్ష పరిశోధనల్లో భారత దేశ స్థానాన్ని సుస్థిరం చేయనున్నది.

# విగ్రహ ధ్వంసం ఘటన దురదృష్టకరం...



హైదరాబాద్, ప్రజల మనోభావాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అంతకు ముందు తలసానికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకొని, పూజలు చేశారు. ఆ తర్వాత ఆలయ నిర్వాహకులు ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రశాంతంగా ఉండే సికింద్రాబాద్ ప్రాంతంలోని అమ్మవారి ఆలయంలో విగ్రహం ధ్వంసం ఘటన దురదృష్టకరమంటూ విచారం వ్యక్తం చేశారు.ఘటన జరిగిన సమయంలో ఐదారు రోజులు ఈ ప్రాంతం మొత్తం భయానకర పరిస్థితులు ఉన్నాయన్నారు. ఎవరి మనోభావాలు వారికి ఉంటాయని, వాటిని దెబ్బతీసే అధికారం ఎవరికీ లేదన్నారు. ఎంతో భక్తితో కొలుచుకునే అమ్మవారి విగ్రహం ధ్వంసం ఘటనతో బస్తీవాసులు కూడా తీవ్ర ఆగ్రహానికి గురైన విషయాన్ని గుర్తు చేశారు. భక్తుల అభిప్రాయాలను దృష్టిలో ఉంచుకొని నూతన విగ్రహ ప్రతిష్ఠ కోసం తాను చర్యలు చేపట్టగా.. అదే సమయంలో ప్రభుత్వం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ కోసం ముందుకొచ్చిందని వివరించారు. ప్రజల సంతోషమే తమకు ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు అంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఇకపై ఇలాంటి ఘటనలు సమాజానికి మంచిది కాదని, పునరావృతం కాకుండా దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మోహన్ బాబు ఉన్మాదిలా దాడి చేశారు.. జర్నలిస్టుల ఆగ్రహం



హైదరాబాద్, మంచు కుటుంబంలో విభేదాలు రచ్చకెక్కాయి. ఇంటి గొడవలు కాస్తా పోలీసు కేసులు, ఘర్షణలకు దారితీశాయి. మంగళవారం జల్‌పల్లిలోని మోహన్ బాబు (మోహన్‌బాబు) ఇంటి వద్ద హైడ్రామా కొనసాగుతోంది. ఇక రాత్రి అక్కడికి వెళ్లిన జర్నలిస్టులపై (జర్నలిస్టులు) మోహన్ బాబు దాడి చేయడం ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ దాడిపై జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం తెలుగు రాష్ట్రాల్లో ఆందోళనకు దిగారు.హైదరాబాద్‌లోని ఫిల్మ్‌ఛాంబర్ ఎదుట జర్నలిస్టులు ఉదయం నుంచి ఆందోళన చేస్తున్నారు. ఛాంబర్ ముందు బైఠాయించి మోహన్ బాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ఆందోళనల్లో %ు%9 మేనేజింగ్ ఎడిటర్ రజనీకాంత్ కూడా ఉంటుంది. ఈ సందర్భంగా జర్నలిస్ట్‌లపై మోహన్‌బాబు దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆయన్ను వెంటనే అరెస్ట్ చేసారు పాత్రికేయులు డిమాండ్ చేస్తున్నారు. ఆయన ఉన్మాదిలా దాడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హత్యాయత్నం కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. ఆయన్ని, ఆయన కుటుంబ సభ్యులను 'మా' అసోసియేషన్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలకు జర్నలిస్టులు భారీగా తరలివచ్చారు. మోహన్ బాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఆయనపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని.

ఇంతకీ ఏం జరిగిందంటే..

జల్‌పల్లి మోహన్‌బాబు నివాసం వద్ద మంగళవారం రాత్రి హైటెన్షన్‌లో వాతావరణం నెలకొంది. జల్‌పల్లి నివాసానికి ఆయన తనయుడు మంచు మనోజ్ రాగా.. సిబ్బంది గేట్లు తెరిచేందుకు నిరాకరించారు. తన కూతురును తీసుకువెళ్తానంటూ గేట్లను బద్దలు కొట్టి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. విష్ణు తరఫు బౌన్సర్లు మనోజ్‌ను, మీడియాను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఈ విధంగానే ఇంట్లో నుంచి బయటకు వచ్చిన మోహన్‌బాబు మనోజ్‌పై చేయి చేసుకున్నారు.ఆ తర్వాత ఘటనను కవర్ చేయడానికి వెళ్లిన మీడియా ప్రతినిధులపై బూతుపురాణం అందుకుంది. తుపాకీ బయటకు తీసి చంపేస్తానని. అలాగే, గొడవపై స్పందించాలని కోరిన టీవీ మీడియా ప్రతినిధి మైక్ లాక్కొని అతనిపైనే దాడి చేశారు. బౌన్సర్ల దౌర్జన్యంతో అనేక జర్నలిస్టులకు గాయాలయ్యాయి. దాడిని నిరసిస్తూ పలువురు జర్నలిస్టులు ఆందోళన. మోహన్‌బాబుపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడి ఘటనపై జర్నలిస్ట్ సంఘాలు సైతం ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ కోరుతున్న మీడియా ప్రతినిధులపై దాడి కేసులో మోహన్‌బాబుపై కేసు నమోదైంది. ఇదిలా ఉం డగా.. మోహన్‌బాబు ప్రస్తుతం గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాలికి గాయం కావడంతో ఆయన చికిత్స తీసుకు ంటున్నట్లు సమాచారం.

# అమృత్ భారత్ స్కీమ్ కింద కాజీపేట రైల్వే స్టేషన్ అభివృద్ధి: అశ్వినీ వైష్ణవ్



న్యూఢిల్లీ: కాజీపేట రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద అభివృద్ధి చేస్తున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. లోక్‌సభలో ఇవాళ ఓ ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఆయన ఈ విషయాన్ని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 70 రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నామన్నారు. దాంట్లో కాజీపేట రైల్వే స్టేషన్ కూడా ఉన్నట్లు చెప్పారు.తెలంగాణకు రైల్వే నిధుల కేటాయింపు పెంచినట్లు మంత్రి చెప్పారు. ఆ రాష్ట్రానికి రికార్డు స్థాయిలో 5336 కోట్లు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. యూపీఏ పాలన సమయంలో ఉమ్మడి రాష్ట్రానికి కూడా ఆ స్థాయిలో నిధులు రాలేదన్నారు. గతంలో తెలంగాణ, ఆంధ్రకు కలిపి కేవలం 866 కోట్లు ఇచ్చినట్లు ఆయన చెప్పారు. కేవలం నిధుల కోసమే విభజన సృష్టించడం సరికాదు అని మంత్రి తెలిపారు.కాజీపేట రైల్వే స్టేషన్‌ను డివిజన్‌గా డెవలప్ చేస్తున్నారా అని వరంగల్ ఎంపీ కడియం కావ్య ప్రశ్న వేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద రైల్వే రీడెవలప్మెంట్ ప్రాజెక్టును మోదీ సర్కారు చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. దేశవ్యాప్తంగా 1300 స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని, చెన్నైలోని ఎగ్మోర్ రైల్వే స్టేషన్‌ను కూడా అమృత్ భారత్ స్కీమ్ కింద డెవలప్ చేస్తున్నట్లు చెప్పారు.

కావాలంటే ఏఐపై చట్టం చేస్తాం: అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ: ఒకవేళ దేశ ప్రజలు కోరుకుంటే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై చట్టాలను రూపొందిస్తామని కేంద్ర ఐటీశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఇవాళ లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అకోలాకు చెందిన బీజేపీ ఎంపీ అనుప్ ధోత్రి ఆ ప్రశ్న వేశారు. కీలక రంగాల్లో ఏఐ డెవలప్మెంట్ గురించి ప్రభుత్వం తీసుకున్న చర్యలను వెల్లడించాలని ఆయన కోరారు. ఆ ప్రశ్నకు సమాధానంగా కావాలంటే ఏఐ చట్టాలను తీసుకువస్తామని మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. నైపుణ్యాభివృద్ధి గురించి మాట్లాడుతూ.. టెక్నాలజ అంటే పేద ప్రజలు వాడేది కాదు అన్నట్లు కాంగ్రెస్ వ్యవహరించిందని మంత్రి పేర్కొన్నారు. నైపుణ్య శిక్షణ కోసం 8.6 లక్షల మంది రిజిస్టర్ చేసుకున్నట్లు మంత్రి చెప్పారు. దేశవ్యాప్తంగా టెక్నాలజీని ప్రజాస్వామ్య పరచడమే ప్రధాని మోదీ ఉద్దేశమని మంత్రి వైష్ణవ్ చెప్పారు.

## నా తండ్రి మాటే నాకు వేదవాక్కు

హైదరాబాద్, డిసెంబర్11 : తన తండ్రి మోహన్ బాబు చెప్పినందుకే.. ఇంట్లోకి వచ్చిన వారందరినీ బయటికి గెంటేశానని, ఆయన చెప్పిందే తనకు వేదవాక్కు అని నటుడు, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణు అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తన తండ్రి అనుమతి లేకుండా ఎవరూ ఇంట్లోకి వెళ్లకూడదని చెప్పారు. మీడియాతో మాట్లాడాలని తన తండ్రి నమస్కరిస్తూ వచ్చే సమయలో అంతా తోసుకుంటూ రావడం వల్ల.. ఒక తండ్రిగా

## అధికారులకు డిప్యూటీ సీఎం స్ట్రాంగ్ వార్నింగ్

అమరావతి,అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. బుధవారం జరిగిన ఏపీ కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ స్మగ్లింగ్‌పై విజిలెన్స్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఆఖరికి పెట్రోల్‌లో కూడా కల్తీ పెరిగిపోతోందని, స్వయానా మంత్రి నాదెండ్ల మనోహర్ వెళ్లి సీజ్ చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఇలాంటి కల్తీలపై చర్యలు తీసుకోవాలని, లేదంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుకను స్ట్రీమ్ లైన్ చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఇన్నేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం 10 లక్షల కోట్ల అప్పులు పాలైందని, అధికారులకు కనీసం జీతాలు కూడా ఇచ్చే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. చంద్రబాబు నాయుడు డైనమిక్ లీడర్ షిప్‌లో ఏపీలో సుస్థిర పాలనను అందిచేందుకు అంతా సహకారం అందించాలని పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ వాళ్లు తెలంగాణ ద్రోహులు

హైదరాబాద్, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తెలంగాణ సంస్కృతిపై మరోసారి దాడి చేసే ప్రయత్నం జరుగుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శించారు. నిన్న విజయోత్సవాల్లో తెలంగాణ సంస్కృతి కనిపించలేదన్నారు. నిన్న కనీసం ఏ ఒక్కరిలోనైనా ఉద్యమ భావోద్వేగాలు కనిపించాయా? ఈ సంబరాల్లో ఎవరైనా జై తెలంగాణ అని నినదించారా? అని ప్రశ్నించారు. ద్రోహుల చెంత చేరి తెలంగాణ తల్లికి మోసం చేయవద్దన్నారు. పార్టీ గుర్తు ప్రచారం కోసం కాంగ్రెస్ తల్లిని ఆవిష్కరించారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ వాళ్లు తెలంగాణ ద్రోహులు... తల్లి పాలు తాగి రొమ్ము గుద్దడమనే సామెతకు వారసులని జగదీశ్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సందర్భంగా అక్కడ పెట్టిన పాట ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ వారిని నిలువెత్తున చీల్చినా... వారి రక్తంలో ఎక్కడా తెలంగాణ ఆత్మ కనిపించదన్నారు.తెలంగాణ చరిత్రను పాతాళానికి తొక్కేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ యాసను విలన్ భాషలా... 'తెలంగాణ' అంటేనే అసహ్యించుకునే ఒక పదంలా, శాసనసభలో 'తెలంగాణ' అనే మాటనే నిషేధించే స్థాయికి వెళ్లారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అప్పట్లో ఏదో మత్తులో పడి తెలంగాణను ఏపీలో కలిపారని, ఇప్పుడు కూడా వనరులను దోచుకునే మత్తులో పడి తెలంగాణను నామరూపాలు లేకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాన్నారు.

# మహిళలకు లాడ్లీ బహనా యోజన కింద ఏటా రూ.15 వేలు

న్యూఢిల్లీ,మహిళల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రకరకాల పథకాలు ప్రవేశపెడుతూ ఉంటాయి. ఈ క్రమంలోనే నెల నెలా అకౌంట్లలో డబ్బులు జమ చేస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలోనే లాడ్లీ బహనా యోజన కింద మహిళలకు ఏటా రూ. 15 వేలు జమ చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ లాడ్లీ బహనా యోజనలో భాగంగా 19వ ఇన్‌స్టాల్‌మెంట్ కింద రేపు లబ్ధిదారుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేయనున్నారు. మధ్యప్రదేశ్‌లో అధికారంలో ఉన్న మోహన్ యాదవ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం.. మహిళల కోసం లాడ్లీ బహనా యోజన పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద లబ్ధిదారులైన మహిళల ఖాతాల్లో నెలకు రూ. 1250 జమ చేస్తోంది. మొత్తంగా ఒక్కో మహిళకు ఏడాదికి రూ. 15 వేలు అందిస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా లాడ్లీ బహనా యోజన 19వ ఇన్‌స్టాల్‌మెంట్ కింద రేపు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్.. డబ్బులు అకౌంట్లలో వేయనున్నారు. ఈ సందర్భంగా అర్హులైన మహిళలు.. తమ ఖాతాల్లో డబ్బులు పడ్డాయో లేదో తెలుసుకునేందుకు వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. డిసెంబర్ 11వ తేదీన జన్ కళ్యాణ్ పర్వ్ ప్రారంభించనున్న సీఎం మోహన్ యాదవ్.. లాడ్లీ బహనా యోజన 19వ విడత డబ్బులు విడుదల చేయనున్నారు.లాడ్లీ బహనా యోజన కింద ప్రతీ మహిళకు నెలకు రూ. 1250 చొప్పున ఏడాదికి రూ. 15వేలు అందనున్నాయి. ఆధార్ కార్డుతో లింక్ అయిన బ్యాంక్ అకౌంట్‌లో నేరుగా డబ్బులు జమ చేయనున్నారు. 2023 జూన్ నుంచి మధ్యప్రదేశ్‌లో మహిళలకు ఆర్థికంగా స్వతంత్ర్యంగా తమ కాళ్ల మీద తాము నిలబడేందుకు, వారి పిల్లలకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించేందుకు గానూ బీజేపీ ప్రభుత్వం ఈ లాడ్లీ బహనా యోజనను ప్రవేశపెట్టింది. లాడ్లీ బహనా యోజన కింద ప్రభుత్వం నుంచి నేరుగా సాయం పొందేందుకు లబ్ధిదారులు తప్పనిసరిగా మధ్యప్రదేశ్‌కు చెందిన వారు అయి ఉండాలి. మహిళలకు పెళ్లి అయి ఉండాలి. భర్త చనిపోయిన మహిళలు, విడాకులు తీసుకున్న వారు, ఒంటరి మహిళలలు ఎవరైనా ఈ లాడ్లీ బహనా యోజనకు అప్లై చేసుకోవచ్చు. ఇక మహిళల వయసు.. 21 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపు ఉండాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిబంధనలు పెట్టింది.


# స్వార్థ రాజకీయాల కోసం విగ్రహాలు మార్చడం బాధాకరం

హైదరాబాద్, స్వార్థ రాజకీయాల కోసం తెలంగాణ ఉద్యమసమయం నుంచి ఏర్పాటు చేసుకున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం ఎంతో బాధాకరమని, దీనిని తెలంగాణ ప్రజలు హర్షించరని ఎమ్మెల్సీ కవిత అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్ చేసిన ఉద్యమాన్ని పూర్తిగా మర్చిపోవటానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని, కానీ కేసీఆర్ తెలంగాణ ప్రజల్లో గుండెల్లో ఎప్పటికీ ఉంటాయని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహం మార్పునకు నిరసనగా హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో తెలంగాణ తల్లికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ మహిళలు ఎప్పటికీ పేదగానే ఉండాలా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ తల్లిని తాము తిరస్కరిస్తున్నామని చెప్పారు. ఉద్యమ తల్లే తమ తల్లి అని, హస్తం గుర్తు తల్లిని ఆమోదించేది లేదన్నారు. రేవంత్ పిట్ట బెదిరింపులకు భయపడేవారు ఎవరూలేరన్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఉద్యమకారులంతా కలిసి ఏర్పాటు చేసుకున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చింది. జొన్నలు, మక్కలు ఇతర రాష్ట్రాల్లో కూడా పండుతాయి. పూలనే పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణది. తెలంగాణ తల్లి చేతి నుంచి బతుకమ్మను తొలగించారు. తెలంగాణ ప్రత్యేకతే బతుకమ్మ. మహిళలకేమో విగ్రహాలు.. మగవాళ్లకేమో వరాలా అని ప్రశ్నించారు. తెలంగాణ తల్లిని మార్చి కాంగ్రెస్ తల్లిని ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. 9 మంది తెలంగాణ కవులు, కళాకారులకు స్థలాలు, డబ్బులిస్తామన్నరు. గుర్తింపునకు మల్లు స్వరాజ్యం, విమలక్క, సంధ్య పనికిరారా అని ప్రశ్నించారు. గ్రాండ్‌గా ఉండే తల్లిని తీసేసి.. బీద తల్లిని పెట్టినమని రేవంత్ గొప్పలు చెప్తుండు. తెలంగాణ మహిళలు ఎప్పటికీ పేదగానే ఉండాలా అన్ని ప్రశ్నించారు. మీ నోటి నుంచి ఎరుకల నాంచారమ్మ, బీడీ కార్మికుల మహిళల పేరు రాలేదన్నారు. ఉద్యమ కాలంలో ఏర్పాటు చేసుకున్న తెలంగాణ తల్లిని మార్చారని విమర్శించారు. విగ్రహం పెట్టామని చెప్పి సామన్య మహిళలకు ఇచ్చిన హామీలు ఎగ్గొడతారా అని నిలదీశారు. కాంగ్రెస్ తల్లిని తాము తిరస్కరిస్తున్నామని చెప్పారు. ఉద్యమ తల్లే మా తల్లి.. హస్తం గుర్తు తల్లిని ఆమోదించేది లేదన్నారు. రేవంత్ పిట్ట బెదిరింపులకు ఎవరూ భయపడరని తెలిపారు.

## కేటీఆర్ ఇప్పుడు ఒక ఎమ్మెల్యే మాత్రమే

హైదరాబాద్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బీజేపీ నేత, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్విండ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈరోజు ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ... కేటీఆర్, కవితలకు వచ్చే ఎన్నికల్లో కుక్క కూడా ఓటు వేయదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ ఇప్పుడు ఒక ఎమ్మెల్యే మాత్రమేనని గుర్తుంచుకోవాలని సూచించారు. తాను ఎప్పుడూ ఫైర్ బ్రాండ్‌నే అని మీడియా ప్రతినిధులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. నా బండి నా చేతిలోనే ఉందని... సమయాన్ని బట్టి తాను గేర్ మారుస్తానని, అప్పుడే స్పీడ్ మారుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో తెలంగాణ తల్లి విగ్రహం పేరుతో పిచ్చి రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు.

# చంద్రబాబు కీలక నిర్ణయం.. ఆరుగురు ఔట్?



అమరావతి,ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూటమి ప్రభుత్వానికి డిసెంబర్ 12తో ఆరు నెలలు నిండుబోతున్నాయి. తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు, మంత్రులకు అర్ధ సంవత్సరం పరీక్షలు ముగుస్తున్నాయి. హనీమూన్ పీరియడ్ పూర్తవ్వడంతో మంత్రుల ప్రోగెస్ రిపోర్టును ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. దీంతో ఈ ఆర్నెళ్ల పరీక్షల్లో పాసయ్యే దెవరు? అట్టర్ ప్లాప్ అయ్యేదెవరు? అంటూ మంత్రుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.ప్రభుత్వం మారిన తర్వాత కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంపై సహజంగానే ప్రజల అంచనాలు, ఆశలు భారీగానే ఉంటాయి. అందుకే ఆరు నెలలపాటు ప్రజలు ఆశావహ దృక్పథం, సానుకూల ధోరణితోనే ఎదురుచూస్తారు. ఆ తర్వాత అసలు సినిమా మొదలవుతుంది. పాలన ఎలా సాగుతోంది? సంక్షేమ పథకాల పరిస్థితేంటి? అని ఓ వైపు ప్రజలు, మరోవైపు ప్రభుత్వ పెద్దలు సైతం రివ్యూలు చేస్తుంటారు. ఈ విషయంలో రాజకీయంగా డక్కా ముక్కీలు తిన్న చంద్రబాబుకు ప్రత్యేకించి ఎవరూ చెప్పనక్కర్లేదు. ప్రజల నాడిని ఎప్పటికప్పుడు పట్టుకోవడానికి చూస్తుంటారనే అభిప్రాయం తొలిసారి ముఖ్యమంత్రి అయినప్పట్నుంచీ ఉంది.

నివేదికలు, సర్వేలు

ఏపీ కేబినెట్‌లో చంద్రబాబు కాకుండా 24 మంది మంత్రులు ఉన్నారు. వీరిలో అర డజను మంది తప్ప, అందరూ కొత్త ముఖాలే. అందుకే ఎక్కడా ఎలాంటి లోటు పాట్లు, పొరపచ్చాలు లేకుండా ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూనే ఉన్నారు. తనదైన శైలిలో రివ్యూలు తీసుకోవడం, నివేదికలను తెప్పించుకుంటూ వారికి తగిన సూచనలు, సలహాలు చేస్తూ ఉన్నారు. అయితే ఈ మధ్య నిర్వహించిన కేబినెట్ సమావేశంలోనూ దిశానిర్దేశం చేసిన చంద్రబాబు, ఆరు నెలల పాలన ముగుస్తున్న నేపథ్యంలో ప్రతి మంత్రి తన శాఖ పరిధి, పని తీరుపై నివేదికలు ఇవ్వాలని ముఖ్యమంత్రి అడిగారు. మరోవైపు చంద్రబాబు కూడా తనదైన శైలిలో సర్వేలు చేయిస్తూ నివేదికలు తెప్పించుకుంటున్నారని అమరావతి వర్గాలు వెల్లడించాయి. వాటన్నింటినీ క్రోడీకరించి మంత్రులకు రానున్న రోజుల్లో సూచనలు, సలహాలు చంద్రబాబు ఇవ్వబోతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇవన్నీ మంత్రుల పనితీరుకు ఇవన్నీ ప్రోగ్రెస్ రిపోర్టులు.

బీ.. సీరియస్

మొత్తం మంత్రుల్లో కొందరు మాత్రమే తమ శాఖల్లో పట్టు సాధించి, బ్రహ్మాండంగా ముందుకెళ్తున్నారని అయితే కొందరు మాత్రం నెమ్మదిగా గాడిలో పడుతున్నారనే అభిప్రాయం చంద్రబాబుకు ఉందని తెలిసింది. ఇంకొందరు మంత్రులు మాత్రం ఇంకా ఏబీసీడీల దశలోనే ఉండి అవగాహన పెంచుకోవడానికి చూస్తున్నారని ముఖ్యమంత్రికి అర్థమైంది. ఆర్నెళ్ల పాలన పూర్తవుతున్న నేపథ్యంలో చంద్రబాబు ఈ మొత్తం వ్యవహారాన్ని సీరియస్‌గా చూస్తున్నారు. ప్రభుత్వం పనితీరు అన్నది ఎమ్మెల్యేలు, మంత్రుల పనితీరుపైనే ఆధారడి ఉంటుంది. అందుకే కేబినెట్ భేటీ జరిగిన ప్రతిసారీ పనితీరు మెరుగుపరుచుకోవాలని పదే పదే కొందరు మంత్రులకు సూచిస్తూ వస్తున్నారు. అంతేకాదు కొందరికి ప్రత్యేకంగా క్లాసులు కూడా తీసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఏ మాత్రం తేడా వచ్చినా ఇబ్బందులు తప్పవని మంత్రులను ముఖ్యమంత్రి హెచ్చరిస్తూ కూడా వచ్చారు.

సీమలో ఇద్దరు ఔట్!

చంద్రబాబు చేయించిన సర్వే రిపోర్టు ఇప్పటికే చేతికందగా, మంత్రుల నుంచి రావాల్సిన నివేదికలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని తెలిసింది. ఆయన చేతికొచ్చిన రిపోర్టు ప్రకారం రాయలసీమ నుంచి ఇద్దరు మంత్రుల పోస్ట్ ఊస్టింగ్ అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని సమాచారం. ఇందులో ఒకరి పనితీరు మరీ దారుణంగా ఉందట. మంత్రి ఎంతసేపూ విమర్శలపాలవ్వడం, ఆయన కుటుంబ సభ్యులు, ప్రధాన అనుచరులు ఎక్కువగా లేనిపోని విషయాల్లో కలుగజేసుకోవడం లాంటివి ఎక్కువగా ఉన్నాయని తెలియవచ్చింది. తొలిసారి మంత్రిని అనే విషయాన్ని మరిచిపోయి వ్యవహరిస్తున్నారని, దీనికి తోడు ఒకట్రెండు సార్లు స్వయంగా ముఖ్యమంత్రి క్లాస్ తీసుకున్నా, గట్టిగా హెచ్చరించినా కూడా సదరు మంత్రిలో నాటి నుంచి నేటి వరకూ ఎలాంటి మార్పు రాలేదని సర్వే రిపోర్టులో తేలిందట. అందుకే ఆ మంత్రి పదవి కచ్చితంగా పోతుందని ఏపీ రాజకీయాల్లో పెద్ద చర్చ జరుగుతోంది.ఇక మరొకరి విషయానికొస్తే తొలిసారి గెలిచి మంత్రి పదవి దక్కించుకున్న సదరు ఎమ్మెల్యే ఇక మళ్లీ అవకాశం వస్తుందో లేదో అన్నట్లుగా ప్రవర్తిస్తున్నారని చంద్రబాబు దృష్టికి వచ్చిందని, ఇదే విషయం సర్వే రిపోర్టులో కూడా రావడంతో ఆయన తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారట. ఎందుకంటే తాను స్వయంగా క్లాస్ తీసుకున్నా కూడా మార్పు రాకపోవడమే ఇందుకు కారణం. ఎంతసేపూ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలతో విరోధాలు, సదరు మంత్రులతోనూ సఖ్యత లేకపోవడం, అధికారులు చెప్పినా కూడా వినలేదన్నది ఆ మంత్రిపై ఉన్న ప్రధాన ఆరోపణ అని తెలిసింది.

ఉత్తరాంధ్ర నుంచి ఒకరు!

ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాల నుంచి ముగ్గురు మంత్రులుగా ఉన్నారు. ఇందులో ఒకరు కింజరపు అచ్చెన్నాయుడు సీనియర్ కాగా, మరో ఇద్దరూ కొండపల్లి శ్రీనివాస్, వంగలపూడి అనిత జూనియర్లే. ఈ ఇద్దరికీ తొలిసారి మంత్రి పదవి అవకాశం వచ్చింది. ఈ ముగ్గురూ మొదట్లో పనితీరు బాగానే కనబరిచినా ఆ తర్వాత ఒకరి విషయంలో చంద్రబాబు ఎందుకో తీవ్ర అసంతృప్తిగానే ఉన్నారని తెలిసింది. శాఖపైన దృష్టి పెట్టి పట్టు పెంచుకోవాలని పదే పదే చెప్పినా ఫలితం మాత్రం శూన్యమట. కనీసం మీడియా ముందు ఎలా నడుచుకోవాలో కూడా తెలియట్లేదట. జిల్లా సీనియర్ మంత్రి సలహాలు, సూచనలు చేసినా, ఒకట్రెండు సార్లు క్లాస్ చంద్రబాబు క్లాస్ తీసుకున్నా కూడా ఫలితం లేకపోవడం గమనార్హం. అందుకే సదరు మంత్రిని పక్కనెట్టాలని ముఖ్యమంత్రి ఫిక్స్ అయ్యారని తెలిసింది. ఈ మంత్రిపై వైసీపీ నుంచి పదే పదే విమర్శలు, సొంత పార్టీ కార్యకర్తలు, ద్వితియ శ్రేణి నేతల నుంచి కూడా ఫిర్యాదులు ఎక్కువయ్యాయని సమాచారం.

కోస్తా నుంచి ఎందరో?

ఇక ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి ఒకరి మంత్రి పదవి ఊస్టింగ్ అయ్యే అవకాశాలు ఎక్కువగానే కనిపిస్తున్నాయి. ఎమ్మెల్యేగా సీనియర్ అయినప్పటికీ ఆయన తొలిసారి మంత్రిగా ఎన్నికయ్యారు. అయితే శాఖను అంతంత మాత్రంగానే పట్టించుకుంటున్న సదరు మంత్రి ఇతర వ్యవహారాలపైనే ఎక్కువగా దృష్టిపెట్టారట. పైకి ముఖ్యమంత్రి దగ్గర మాత్రం అన్నీ తానే చేస్తున్నా అనేలా ప్రవర్తిస్తూ మార్కులు కొట్టేయడానికి ముందు వరుసలో ఉంటున్నారని తెలిసింది. అందుకే మాటలు కాదు, చేతలు కావాలని ఒకానొక సందర్భంలో కేబినెట్ భేటీ పూర్తయ్యాక విడిగా మాట్లాడి హెచ్చరించారు. అయితే నాటి నుంచి నేటికి అబ్బే అవేమీ మనకు పట్టవన్నట్లుగా మంత్రి ప్రవర్తిస్తూ చంద్రబాబు ఆగ్రహానికి లోనయ్యారట. అందుకే ఇక అలాంటి వ్యక్తి ఆర్నెళ్లు కాదు కదా ఇంకో ఏడాదిన్నర సమయం ఇచ్చినా ఫలితం లేదని ముఖ్యమంత్రి ఓ నిర్ణయానికి వచ్చినట్లుగా తెలిసింది.ఇక ఉమ్మడి గుంటూరు, నెల్లూరు, విజయవాడ నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రుల్లో ఇద్దరి విషయంలో సీఎం సంతృప్తిగా లేరని సమాచారం. ఇచ్చిన శాఖలకు న్యాయం చేయడం పక్కనెట్టి జిల్లాలో అన్ని విషయాల్లో వేలు పెట్టడమే పనిగా పెట్టుకున్నారని ఓ మంత్రిపై గుర్రున ఉన్నారట చంద్రబాబు. ఇంకో మంత్రి అయితే పదవి వచ్చింది ఆలస్యం, దాన్ని అడ్డుపెట్టుకుని జిల్లానే కాదు, ఇతర జిల్లాల్లోనూ వేలుపెట్టి తనకు కావాల్సిన పనిని చేసుకుంటున్నారట. ఇదేం పద్ధతి? ఎక్కడ్నుంచి ఎక్కడికి వస్తున్నారు? అని ఆయనపై నేరుగా ముఖ్యమంత్రికే ఫిర్యాదు చేశారట. దీంతో ఇవన్నీ మానుకోవాలని ముఖ్యంగా ఉచిత ఇసుక, మద్యం విషయంలో అసలు కలుగజేసుకోవద్దని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారని తెలిసింది. హెచ్చరించి మూడు నెలల వ్యవధి అయినా సరే ఇంతవరకూ ఇసుమంత కూడా సదరు మంత్రిలో మార్పు రాకపోవడం గమనార్హం. అందుకే ఇలాంటి ఒక్కరి వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని చంద్రబాబు భావిస్తున్నారట.

విస్తరణలో భాగంగా..

ఇలా రాయలసీమ నుంచి ఇద్దరు, ఉత్తరాంధ్ర ఒకరు, కోస్తా నుంచి ముగ్గురి విషయంలో మొత్తం ఆరుగురు మంత్రులపై గుర్రుగా చంద్రబాబు ఉన్నారట. సంక్రాంతి తర్వాత వారందర్నీ పక్కనెట్టినా, లేదంటే ఇంకో ఆర్నెళ్లు సమయం ఇచ్చినా ఇవ్వొచ్చని తెలిసింది. ఇక అప్పటికీ పనితీరు మారకపోయినా, శాఖపై పట్టు సాధించలేకపోయినా మరుక్షణమే పక్కనెడతారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో జనసేనకు చెందిన మంత్రి కూడా ఒకరు ఉన్నారని సమాచారం.మంత్రుల నుంచి రిపోర్టు ఎప్పుడు వస్తుందో? అందులో ఏం తేలుతుందో? తన సర్వేతో ఆ రిపోర్టు బేరీజు చేసుకుని తదుపరి నిర్ణయం తీసుకునే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. పక్కనెట్టే మంత్రుల స్థానంలో ఈసారి అందరూ సీనియర్లనే తీసుకునే అవకాశం లేకపోలేదు. ఎందుకంటే అసలే జమిలి అనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో తప్పకుండా సీనియర్లు అయితేనే ఇచ్చిన శాఖకు న్యాయం చేస్తారని రాజకీయ విశ్లేషకులు కూడా అభిప్రాయపడుతున్నారు. మంత్రి పదవుల్లో ఉండేదెవరు? కేబినెట్ నుంచి ఊడెదెవరు? మంత్రులయ్యే అవకాశం సీనియర్లలో ఎవరికుంది? చంద్రబాబు మనసులో ఎవరున్నారో? అనేది తెలుసుకోవడానికి ఎన్డీఏ కూటమి పార్టీల కార్యకర్తలు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.

# ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ షురూ..




అమరావతి,అందుబాటులోకి వస్తున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేందుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధం అన్న విషయం అందరికీ తెలిసిందే. ఆ కోవకే చెందిన వార్త ఇది. ఏఐ, డీప్‌టెక్ వంటి టెక్నాలజీ సేవలు వినియోగించుకుని వాట్సాప్ ద్వారా పౌర సేవలు వేగంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. మనం ప్రతీ సమాచారాన్ని పొందడానికి, చేరవేయడానికి వాట్సాప్‌ను ఎలా వినియోగిస్తున్నామో, ఇక ప్రభుత్వం కూడా మనకు అవసరమైన సేవలు వాట్సాప్‌లో అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దీంతో ఇకపై వచ్చేదంతా వాట్సప్ గవర్నెన్స్ అంటూ తాజాగా ప్రకటించింది కూడా. పాలనలో మరింతగా సాంకేతికత వినియోగం అవసరమని, విభాగాల వారీగా రియల్‌టైమ్ డ్యాష్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ ఆ పర్యవేక్షణ బాధ్యతలను ఆర్టీజీఎస్‌కు అప్పగించింది రాష్ట్ర ప్రభుత్వం.సమర్ధవంతమైన పాలన అందించేలా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకోవాలని, రియల్‌టైమ్‌లో సమాచారాన్ని సేకరించి మిగిలిన శాఖలతో అనుసంధానం కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల సమాచారాన్ని ఆర్టీజీఎస్ సమీకృతం చేసి, మొత్తంగా పర్యవేక్షించాల్సి ఉంటుందని కూడా బాధ్యతలు ఫిక్స్ చేసారు. మొదటగా ప్రతిశాఖలో సమాచార సేకరణ జరగాలని, తర్వాత ఆ సమాచారాన్ని సమీకృతం చేసుకోవాలని.. అంతిమంగా 'వాట్సప్ గవర్నెన్స్' ద్వారా అత్యుత్తమ సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించింది. మంగళవారం సచివాలయంలో సీఎంవోతో సహా ఆర్టీజీఎస్‌కు చెందిన అధికారులతో జరిగిన సమీక్షలో ముఖ్యమంత్రి పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. కుల ధృవీకరణ దగ్గర నుంచి ఆదాయ ధృవీకరణ పత్రం, ఇతర ధృవపత్రాలను పొందేందుకు వాట్సప్‌ను వేదిక చేసుకునేలా వ్యవస్థను రూపొందించాలన్నది ప్రభుత్వ ఆలోచన. ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు ఏఐ, డీప్‌టెక్ వంటి టెక్నాలజీ సేవలు వినియోగించుకుని వేగంగా పరిష్కరించాలన్నది ప్రభుత్వ ఆలోచన. వినతుల పరిష్కార విధానం, ప్రజల సంతృప్తి స్థాయి కూడా ఆర్టీజీఎస్ పరిశీలించాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. డ్రోన్లు, సీసీ కెమేరాలు, శాటిలైట్లు, ఐవోటీ డివైజ్‌ల ద్వారా సేకరిస్తున్న విజువల్స్‌ను కూడా సమీకృతం చేయాల్సి ఉందని ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. ఇటీవల గూగుల్ మ్యాప్‌ల ద్వారా గుర్తించిన గంజాయి తోటలను డ్రోన్ల సాయంతో ధృవీకరించుకోవడం జరిగిందని.. అలాగే రానున్న రోజుల్లో పంట తెగుళ్లను గుర్తించి, రైతులను అప్రమత్తం చేసేందుకు డ్రోన్లు వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే రాష్ట్రంలోని రహదారులపై జరుగుతున్న ప్రమాదాలకు గల కారణాలను అన్వేషించేందుకు డ్రోన్ల ద్వారా ప్రమాద స్థలాలను గుర్తించి పరిష్కరించాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన ధాన్యం సేకరణపై రైతుల్లో సంతృప్తి వ్యక్తమవుతోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఐవీఆర్ఎస్ ద్వారా చేపట్టిన అభిప్రాయ సేకరణలో నాణ్యతకు తగ్గ ధర, 48 గంటల్లో డబ్బులు జమ చేయడం, రవాణా సౌకర్యం, గోనె సంచుల లభ్యతపై 90 శాతానికి పైగా రైతులు తమ సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. సంతృప్తి స్థాయి తెలుసుకోవడం ద్వారా మరింత మెరుగ్గా సేవలు అందించవచ్చని ముఖ్యమంత్రి అన్నారు. ఒకవేళ ఎక్కడైనా అసంతృప్తి ఉంటే..ఎందుకు వ్యక్తమవుతోందనే దానిని పరిశీలించి తక్షణం ఆ సమస్యను పరిష్కరించాలని సూచించారు.

# నేను పార్టీలు మారడం లేదు..

అమరావతి, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ పార్టీ తరుపున ఆంధ్రప్రదేశ్ నుంచి ఆర్. కృష్ణయ్య పోటీ చేస్తున్నారు. నామినేషన్ అనంతరం మీడియాతో మాట్లాడిన ఆర్. కృష్ణయ్య.. బీసీ రిజర్వేషన్లపై చట్టసభల్లో పోరాటం చేస్తానన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించడం ప్రస్తుత పరిస్థితుల్లో బీజేపీతోనే సాధ్యమన్నారు. బీసీల కోసం తాను చేస్తున్న సేవలను గుర్తించి బీజేపీ ఈ అవకాశం ఇచ్చిందన్నారు. మరోవైపు తాను పార్టీలు మారడం లేదన్న ఆర్. కృష్ణయ్య పార్టీలే తన వద్దకు వస్తున్నాయని అన్నారు. టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఆర్. కృష్ణయ్య.. ఆ తర్వాతి కాలంలో వైసీపీలో చేరారు. వైసీపీ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. అయితే రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన కృష్ణయ్య.. ఇప్పుడు అదే స్థానానికి బీజేపీ నుంచి పోటీ చేస్తున్నారు.

# రాష్ట్ర విభజనను పార్లమెంట్‌లో తలుపులు మూసేసి చేశారు

అమరావతి,ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు రాజమండ్రి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ బహిరంగ లేఖ రాశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనను పార్లమెంట్‌లో తలుపులు మూసేసి చేశారన్న ఉండవల్లి అరుణ్ కుమార్.. ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై తాను పదేళ్లుగా పోరాడుతూనే ఉన్నానని చెప్పారు. ఈ విషయమై సుప్రీంకోర్టులో తాను పిటిషన్ వేస్తే.. కేంద్రం ఇన్నేళ్లయినా కౌంటర్ దాఖలు చేయలేదని చెప్పారు. అలాగే ఎన్డీఏ ప్రభుత్వంలో కీలకంగా ఉన్నందున పవన్ కళ్యాణ్ ఆ బాధ్యత తీసుకోవాలని.. రాష్ట్రం నుంచి కూడా అఫిడవిట్ దాఖలు చేయాలని ఉండవల్లి సూచించారు.ఈ విషయంలో తాను సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్ పదేళ్లుగా నడుస్తూనే ఉందన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ కనీసం కౌంటర్ దాఖలు చేయలేదన్నారు. అలాగే కేంద్రం నుంచి రాష్ట్రానికి రూ. 74542 కోట్లు బకాయిలు రావాలని ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ తేల్చిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ తర్వాత 2018లో అప్పటి సీఎం నారా చంద్రబాబు నాయుడు కలిసి ఈ విషయమై చర్చించానని.. దీనిపై లోక్ సభలో చర్చించేందుకు నోటీసు ఇవ్వాలని, సుప్రీంకోర్టులో రాష్ట్రం తరుపున అఫిడవిట్ దాఖలు చేయాలని చంద్రబాబు నిర్ణయించారని చెప్పారు. కానీ అవి ఇప్పటికీ అమలు కాలేదని ఉండవల్లి విమర్శించారు. 2019లో విజయవాడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మనకు జరిగిన అన్యాయంపై పార్లమెంటులో చర్చించాలని, సుప్రీంకోర్టులో ప్రస్తావించాలని తీర్మానించామని.. కానీ నాటి ఎన్నికల్లో వైసీపీ గెలిచిందని ఉండవల్లి అరుణ్ కుమార్ లేఖలో పేర్కొన్నారు. ఏపీకి జరిగిన అన్యాయంపై సుప్రీంకోర్టులో రాష్ట్రం తరుపున అఫిడవిట్ దాఖలు చేయాలని.. ఆ తర్వాత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా తాను లేఖ రాశానని కానీ తనకు ఎలాంటి సమాధానం రాలేదని ఉండవల్లి పేర్కొన్నారు. అయితే 2022లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరుపున కోర్టుకు హాజరైన సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింఘ్వీ .. తాను వేసిన పిటిషన్‌పై విచారణను మూసివేయాలని కోరినట్లు ఉండవల్లి గుర్తుచేశారు. 2014 ఫిబ్రవరిలో పార్లమెంటులో జరిగిన ఘటనలపై, ఏపీకి జరిగిన అన్యాయంపై టీడీపీ, వైసీపీ సభ్యులు చర్చకు నోటీసులు ఇవ్వడం లేదన్న ఉండవల్లి.. ఎక్కడైతే మన నోరు నొక్కి సభా నిబంధనలను తుంగలో తొక్కి భారత రాజ్యాంగాన్ని భ్రష్టు పట్టించారో... అక్కడే మనకు జరిగిన అన్యాయాన్ని ఎలుగెత్తి చాటాలని కోరారు. ప్రస్తుతం టీడీపీ, జనసేన పార్టీలు ఎన్డీయే కూటమిలో ఉండటంతో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడానికి ఇదే సరైన సమయమని ఉండవల్లి అరుణ్ కుమార్ అభిప్రాయపడ్డారు.ఈ విషయంలో శ్రద్ధ తీసుకుని, పార్లమెంటు ఉభయ సభల్లోనూ విభజన జరిగిన తీరు, ఏపీకి జరిగిన అన్యాయంపై చర్చకు నోటీసు లిప్పించాలనీ, సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర విభజన అంశాన్ని ఒక కొలిక్కి తీసుకురావాలని ఉండవల్లి అరుణ్ కుమార్ పవన్ కళ్యాణ్‌ను కోరారు.

# ఏపీకి త్వరలో కొత్త డీజీపీ..!

అమరావతి,కొత్త ఏడాదిలో ఆంధ్రప్రదేశ్‌కు కొత్త డీజీపీ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుత డీజీపీ ద్వారకా తిరుమల రావు ఈ ఏడాది చివరిలో రిటైర్ కానున్నారు. ఆయన పదవికాలం పొడిగించే అవకాశం లేదని తెలుస్తోంది. ఇప్పటి వరకూ చీఫ్ సెక్రటరీ పదవీ కాలం పొడిగించేవారు కానీ డీజీపీ పదవి కాలాన్ని పొడిగించిన సందర్భాలు మాత్రం లేవు. ఈ క్రమంలో ప్రస్తుత డీజీపీ ద్వారకా తిరుమలరావు పదవి కాలం పొడిగింపునకు సీఎం చంద్రబాబు ప్రయత్నం చేస్తారా? మరొకరికి ఛాన్స్ ఇస్తారా? అన్నది త్వరలో తెలియనుంది. ఇప్పటికే ఆయన రిటైర్మెంట్ డేట్ పై సీఎఫ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న ఐపీఎస్ అధికారుల్లో అత్యంత సీనియర్ ద్వారకా తిరుమలరావు. ఎన్నికల సంఘం ఎన్నికల సమయంలో రాజేంద్రనాథ్ రెడ్డిని డీజీపీగా తప్పించింది. నిజానికి ఆయన సీనియార్టీలో టాప్ టెన్ లో లేరు. కానీ నాటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, మనోజ్ అనుకుని ఆయనను అందలం ఎక్కించారు. ఎన్నికల సమయంలో ఈసీ ఆయనను తప్పించి సీనియర్టీలో మొదటిస్థానంలో ఉన్న ద్వారకా తిరుమలరావును కూడా కాదని హరీష్ కుమార్ గుప్తాకు ఛాన్స్ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడిన తరవాత కొన్నాళ్లు గుప్తానే డీజీపీగా ఉన్నారు. కానీ తర్వాత ద్వారకా తిరుమలరావుకు ఛాన్స్ ఇచ్చారు. చంద్రబాబు డీజీపీ విషయంలో నిబంధనల ప్రకారం వెళ్తారని, సీనియార్టీకి గౌరవం ఇస్తారని, అదేసమయంలో సమర్ధత కూడా చూస్తారని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. సీనియార్టీ ఉన్నా అంచనాలకు అనుగుణంగా పని చేస్తారని అనుకోకపోతే పదవి ఇవ్వరని కూడా అనుకుంటున్నారు. అందువల్లనే ద్వారకా తిరుమలరావు తర్వాత మళ్లీ హరీష్ గుప్తాకే డీజీపీగా ఛాన్స్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఎవరు డీజీపీగా ఉన్నా వైసీపీ హయాంలో సవాంగ్, రాజేంద్రనాథ్ రెడ్డి తరహాలో విచ్చలవిడిగా వ్యవహరించే అవకాశం మాత్రం ఉండదని గుర్తు చేస్తున్నారు.

# ఏపీ హైకోర్టులో సజ్జలకు ఊరట

అమరావతి, టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ అగ్రనేత సజ్జల రామకృష్ణారెడ్డికి ఏపీ హైకోర్టులో ఊరట లభించింది. సజ్జల రామకృష్ణారెడ్డిపై మరో రెండు వారాల పాటు తొందరపాటు చర్యలు తీసుకోవద్దని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ కేసులో సజ్జల ముందస్తు బెయిల్ కోరుతూ ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమను వేధిస్తున్నారని సజ్జల ఆరోపించారు. ముఖ్యంగా, తనపై 41ఏ నోటీసులకు అవకాశం లేని సెక్షన్లతో కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని ప్రయత్నిస్తున్నారని వివరించారు. అందుకే తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని సజ్జల కోర్టును కోరారు. ఈ పిటిషన్ పై ఉన్నత న్యాయస్థానం నేడు విచారణ చేపట్టింది. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు... గతంలో ఇచ్చిన ఆదేశాలను మరో రెండు వారాలు పొడిగించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

# అసమ్మతి...అనైక్యత...



న్యూఢిల్లీ,ఆరు నెలల క్రితం లోక్‌సభ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించిన ప్రతిపక్ష 'ఇండియా' కూటమి అనతికాలంలోనే నాలుగు రోడ్ల కూడలిలో దిక్కుతోచని పరిస్థితిలో పడినట్టు కనిపిస్తోంది. జార?ండ్, జమ్ము - కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుబాటలో పయనించినా, హర్యానా, మహారాష్ట్రల్లో ఎదురైన దిగ్భ్రాంతికరమైన పరాజయాలు ఇప్పుడు కూటమి భాగస్వామ్యపక్షాల మధ్య విభేదాల కుంపటిని రాజేస్తున్నాయి. హర్యానా ఎన్నికల్లో మితిమీరిన ఆత్మవిశ్వాసంతో చేజేతులా కాంగ్రెస్ ఓటమి కొనితెచ్చుకుంటే, మహారాష్ట్రలో మహావికాస్ అఘాడీ (ఎంవీఏ) సోదిలో లేకుండా పోవడమూ స్వయంకృతమేనన్న భావన అసమ్మతిని పెంచింది. ఖర్గే సారథ్యంలోని 'ఇండియా' కూటమిలో ప్రధానపాత్ర కాంగ్రెస్‌దే గనక మహారాష్ట్రలో దెబ్బతో అనూహ్యంగా నాయకత్వ మార్పు అంశం తెర మీదకొచ్చింది. సారథ్యానికి సిద్ధమంటూ మమత ముందుకు రావడంతో కథ మలుపు తిరిగింది.కూటమి ఆశించిన ఫలితాలు రావడం లేదన్న అసంతృప్తి పెరుగుతున్న పరిస్థితుల్లో అసలీ కూటమి ఏర్పాటులో కీలకపాత్ర పోషించినదే మమతా బెనర్జీ గనక ఇప్పుడీ కూటమికి ఆమే సారథ్యం వహించాలనీ, అందుకామె సిద్ధంగా ఉన్నారనీ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ ముందుగా గళం విప్పారు. ఆ తర్వాత కొద్ది రోజులకే దీదీ ఓ ఇంటర్వ్యూ ఇస్తూ, 'కూటమిని వారు నడిపించ లేకపోతే, నేనే నడిపిస్తాను' అని కుండబద్దలు కొట్టేశారు. బెంగాల్‌ను వీడకుండా,అక్కడ నుంచే కూటమి సాఫీగా నడిచేలా చేస్తాననీ వ్యాఖ్యానించారు. దానికి కొనసాగింపుగా జాతీయవాద కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అగ్రనేత శరద్ పవార్ సైతం జాతీయ నేతగా మమత సమర్థురాలనడంతో తేనెతుట్టె కదిలింది. కూటమిలోని లుకలుకలు, కాంగ్రెస్ పట్ల ఇతర భాగస్వామ్య పక్షాల అసంతృప్తి, అసమ్మతి స్వరాలు బయటపడ్డాయి. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), అలాగే రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) అధినేత లాలూ సహా పలువురు కోరస్ కలపడంతో విషయం వీధికెక్కింది. సీపీఐ సైతం సీట్ల సర్దు బాటులో వామపక్షాలకు కూటమి చోటివ్వడం లేదంటూ, కాంగ్రెస్ ఆత్మశోధన చేసుకోవాలనేశారు.నిజానికి, ఈ ఏటి లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమికి కొంత ఊపు వచ్చినా, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బలతో అంతా నీరుగారింది. ఆ మధ్య హర్యానాలో దెబ్బ తినడమే కాక, తాజా మహారాష్ట్ర ఎన్నికల్లో కూటమి తుడిచిపెట్టుకుపోవడం అశనిపాతమైంది. ఆశలు క్షీణించడంతో హస్తం పార్టీ సారథ్యంపై అసమ్మతి స్వరం పెరిగింది. ఆ మాటకొస్తే తృణ మూల్ చాన్నాళ్ళుగా కాంగ్రెస్‌కు దూరంగా ఉంటోంది. ఎన్నికల్లో పొత్తు పెట్టుకోలేదు సరికదా పార్లమెంట్ సమావేశాల్లోనూ అంటీముట్టని వైఖరి. ఇటీవల ఎస్పీది సైతం అదే ధోరణి. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఉపఎన్నికల్లో హస్తం పార్టీతో కలవడానికి ఇష్టపడకపోగా, పార్లమెంట్‌లో రాహుల్ ముందుండి నడుపుతున్న అదానీ వ్యతిరేక నిరసన ప్రదర్శనల్లోనూ తృణమూల్ లానే పాలు పంచు కోవట్లేదు. ఇది చాలదన్నట్టు రానున్న ఢిల్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తున్నట్టు ఆప్ ప్రకటించింది. అభ్యర్థుల పేర్లు విడతల వారీగా విడుదల చేసేస్తూ, చర్చలకు తావు లేకుండా చేసేసింది. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ ఆత్మపరిశీలన చేసుకోవాలనీ, ప్రతిపక్ష ఐక్యతకు చర్యలు ఆలోచించాలనీ శివ సేన (ఉద్ధవ్ బాల్‌ఠాక్రే) పేర్కొన్నదంటే వ్యవహారం ఎందాకా వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. మల్లికార్జున్ ఖర్గే సారథ్యంలోని కాంగ్రెస్ శైలిపై అసంతృప్తి బాహాటమవుతున్న వేళ... ప్రతిపక్ష కూటమి భవిష్యత్ నేత ఎవరు, భవిష్యత్ దిశ ఏమిటన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. కూటమిని దీదీ నడిపితే అభ్యంతరం లేదంటూనే, ఈ బీజేపీ వ్యతిరేక కూటమిలో పలువురు సీని యర్ నేతలు ఉన్నందున కూర్చొని చర్చించి, ఏకాభిప్రాయంతో నిర్ణయం తీసుకోవాలంటూ ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఇప్పటికే సన్నాయి నొక్కులు నొక్కారు. అసలు బీజేపీయేతర ప్రతిపక్షాలన్నీ కలసి 'ఇండియా' కూటమిగా జట్టు కట్టినా, వాటికి సరైన సైద్ధాంతిక భూమికే కాదు... నేటికీ సమ న్వయ సంఘం, ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక, భవిష్యత్ మార్గదర్శనం లాంటివేమీ లేవు. అందు కోసం గడచిన ఏణ్ణర్థం పైగా ప్రత్యేకించి కసరత్తులు చేసిన దాఖలాలూ లేవు. నిన్నగాక మొన్న మహారాష్ట్ర ఎన్నికల్లో ఎంవీఏ గొడుగు కింద అందరూ కలసి పోటీ చేసినా... బాబ్రీ మసీదు కూల్చివేతను శివసేన (యుబీటీ) నేత ఒకరు సమర్థించడంతో యూపీలో ముస్లిమ్ ఓట్లపై ఆధార పడ్డ ఎస్పీ తాజాగా ఎంవీఏ నుంచి బయటకొచ్చేసింది. దీన్నిబట్టి ఎన్నికల కోసం కలవడమే తప్ప 'ఇండియా' పక్షాల మధ్య సహాయ సహకారాలే కాదు సమన్వయం కూడా లేదన్నది స్పష్టం.కాంగ్రెస్‌కు కానీ, కూటమికి కానీ సారథ్య బాధ్యతలు తీసుకోకున్నా చక్రం తిప్పడంలో ముందున్న రాహుల్ పరివారానికి ఇప్పుడిది కొత్త పరీక్ష. పార్లమెంట్‌లో సోనియా, రాహుల్, తాజాగా గెలిచొచ్చిన ప్రియాంక ముగ్గురున్నా కూటమికి బలిమి చేకూరుతున్న దాఖలాలు లేవు. పెద్దన్న పాత్రలో అత్యుత్సాహం చూపుతున్న హస్తం పార్టీ కార్యకర్తలకు కానీ, ఇతర పార్టీలకు కానీ స్ఫూర్తినివ్వడంలో పదే పదే విఫలమవుతోంది. ఇకనైనా సాటిపక్షాల మాటలకు అది చెవి ఒగ్గాలి. పరస్పర గౌరవంతో అందరినీ కలుపుకొనిపోవాలి. తాజా గందరగోళంతో త్వరలోనే 'ఇండియా' కూటమి విచ్ఛిన్నమవడం ఖాయమని బీజేపీ జోస్యం చెబుతోంది. కాషాయపార్టీపై సమైక్యంగా పోరు సాగించడమే ధ్యేయంగా పురుడు పోసుకున్న ప్రతిపక్ష కూటమి ఇలా అనైక్యతా రాగం ఆలపిస్తూ పోతే చివరకు అదే జరుగుతుంది. నాయకత్వచర్చ చివరకు కూటమి ఎన్నికల అజెండాపై కారుమబ్బుల్ని కమ్మేస్తేనే కష్టం. అధికారపక్ష అంచనా తప్పు అని నిరూపించాల్సిన బాధ్యత పూర్తిగా ప్రతిపక్షాలదే!

# ఎయిర్‌పోర్ట్ భూ సేకరణకు కసరత్తు!

వరంగల్ :వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో కీలకమైన భూ సేకరణ పై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. భూ నిర్వాసితులకు పరిహారం, ఇతరత్రా వాటి కోసం తాజాగా ప్రభుత్వం రూ.205 కోట్లు విడుదల చేస్తూ జీవో జారీ చేసింది. భూ సేకరణకు కూడా నోటిఫికేషన్ విడుదల చేసింది. తదనుగుణంగా వరంగల్ ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో ఇప్పటికే రూట్ మ్యాప్ సిద్ధమైంది. త్వరలోనే గాడిపల్లి, గుంటూరుపల్లి, నక్కలపల్లి గ్రామాల్లో కలెక్టర్ సత్యశారద గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. వరంగల్ జిల్లా ఖిలావరంగల్ మండలంలోని మామూనూరులో ఎయిర్ పోర్ట్ స్థలం 693ఎకరాలుండగా, మరో 253ఎకరాలకు గాడిపల్లి, గుంటూరుపల్లి గ్రామాల నుంచి 197ఎకరాలు, నక్కలపల్లి గ్రామం నుంచి 149.36ఎకరాలు, మామునూరు గ్రామం నుంచి 5ఎకరాలను సేకరించనున్నారు. ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తి చేసిన అధికారులు మొత్తం 233మంది రైతుల నుంచి భూ సేకరణ చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. పలు గ్రామాల రైతులు రూ.2కోట్లు డిమాండ్ చేస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లు సమాచారం. వరంగల్ మామునూరు ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి సానుకూల పవనాలు వీస్తున్న నేపథ్యంలో కీలకమైన భూ సేకరణ పై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. భూ నిర్వాసితులకు పరిహారం, ఇతరత్రా వాటి కోసం తాజాగా ప్రభుత్వం రూ.205 కోట్లు విడుదల చేస్తూ జీవో జారీ చేసింది. భూ సేకరణకు కూడా నోటిఫికేషన్ విడుదల చేసింది. తదనుగుణంగా వరంగల్ ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో భూ సేకరణ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. భూ సేకరణకు ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించడంతో ఇప్పటికే రూట్ మ్యాప్ సిద్ధమైంది. త్వరలోనే గాడిపల్లి, గుంటూరుపల్లి, నక్కలపల్లి గ్రామాల్లో కలెక్టర్ సత్యశారద గ్రామ సభలు నిర్వహించనున్నట్లు సమాచారం.

ఇదీ భూ సేకరణ లెక్క..!

వరంగల్ జిల్లా ఖిలావరంగల్ మండలంలోని మామూనూరులో ఎయిర్ పోర్ట్ స్థలం 693ఎకరాలుండగా, మరో 253ఎకరాలను గాడిపల్లి, గుంటూరుపల్లి గ్రామాల నుంచి 197ఎకరాలు, నక్కలపల్లి గ్రామం నుంచి 149.36ఎకరాలు, మామునూరు గ్రామం నుంచి 5ఎకరాలను సేకరించనున్నారు. ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తి చేసిన అధికారులు మొత్తం 233మంది రైతుల నుంచి భూ సేకరణ చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉన్న భూ విలువకు



బహిరంగ మార్కెట్‌లో ఉన్న భూముల ధరలకు చాలా వ్యత్యాసం ఉండడంతో విమానాశ్రయ నిర్మాణానికి కావాల్సిన భూ సేకరణ ప్రక్రియపై స్తబ్ధత ఏర్పడుతోంది. ప్రభుత్వ రికార్డుల ప్రకారం గాడిపల్లి, గుంటూరుపల్లి, నక్కలపల్లి గ్రామాల్లో ఎకరం ధర కేవలం రూ.6లక్షల నుంచి రూ.10లక్షల్లోపే నమోదై ఉండడం గమనార్హం. వాస్తవానికి జీడబ్ల్యూఎంసీ పరిధిలోని ఈ గ్రామాల్లో భూముల ధరలు రూ.కోటిన్నర నుంచి రూ.2కోట్ల వరకు కూడా పలుకుతున్నాయి.

రూ.కోటి ఇస్తాం.. కాదు రూ.2కోట్లు..!

భూ సేకరణ విషయంలో రైతులకు అన్యాయం చేయకుండా న్యాయపరమైన పరిహారం అందించేలా చూస్తానని భూ నిర్వాసిత గ్రామాల ప్రజలకు మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. రైతుల త్యాగానికి అనుగుణంగా న్యాయమైన పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తోంది. అందులో మార్కెట్ రేటుకు అనుగుణంగానే పరిహారం చెల్లింపు చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గాడిపల్లి, గుంటూరుపల్లి, నక్కలపల్లి గ్రామాలు రూ.2కోట్లు డిమాండ్ చేస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా కొంతమంది రైతులు తమకు పరిహారం కాకుండా తాము కోల్పోతున్న భూములకు అనుగుణంగా ఎయిర్‌పోర్ట్‌కు సమీపంలోనే సమానమైన భూమిని చూపాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మంగళవారం మూడు గ్రామాలకు చెందిన రైతులు, భూ నిర్వాసితులు వరంగల్ ఆర్డీవో సత్యపాల్‌రెడ్డిని, ఖిలా వరంగల్ తహశీల్దార్ బండి నాగేశ్వర్‌రావును కలిసి వినతిపత్రం అందజేయడం గమనార్హం.

# మెగా బ్రదర్‌కి మెగా శాఖ దక్కేనా?



అమరావతి,తమ్ముడికి అన్నగా.. అన్నకి తమ్ముడిగా నిలబడ్డాడు. అన్న పార్టీ పెట్టినా.. తమ్ముడు పార్టీ పెట్టినా వెన్నుదన్నుగా ఉన్నాడు. ఓటమి ఎదురుపడినా అధైర్యపడలేదు. చేయిదాకా వచ్చిన సీట్లు చేజారినా.. నిరుత్సాహపడలేదు. చివరకు ఇప్పుడు ఏపీ క్యాబినెట్‌లోకి అడుగుపెట్టబోతున్నాడు మెగా బ్రదర్ నాగబాబు. నాగబాబుకు మంత్రి పదవి దక్కడం వెనుకు పవన్ ప్రయత్నం ఉందా.. మరి కూటమి ప్రభుత్వం ఏ శాఖ కట్టబెట్టనుంది.తెలుగు సినీ పరిశ్రమలో పెద్ద కుటుంబాల్లో ఒకటైన మెగా ఫ్యామిలీకి ఈ సంవత్సరం అదృష్టం వరించింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిఠాపురం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, ఇప్పుడు ఏపీ డిప్యూటీ సీఎంగా సత్తా చాటుతున్నారు. ఈ సంతోష సమయంలో మరింత గర్వకారణంగా మెగా ఫ్యామిలీకి మరో గుడ్‌న్యూస్ వచ్చింది. మెగా బ్రదర్ నాగబాబును చంద్రబాబు నాయుడు తన క్యాబినెట్‌లోకి తీసుకుంటున్నట్లు అధికారికంగా ప్రకటించారు.మెగా బ్రదర్ నాగబాబుకు రాజకీయాలేం కొత్తకాదు. మెగాస్టార్ చిరంజీవి గతంలో స్థాపించిన ప్రజారాజ్యం పార్టీ రోజుల్లోనే క్షేత్రస్థాయిలో కేడర్ నడిపి తన ప్రతిభను చూపించారు. పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ ప్రారంభించినప్పుడు, నాగబాబును ప్రధాన కార్యదర్శిగా నియమించి, పార్టీ కార్యకలాపాలను దగ్గరుండి చూసుకున్నారు. 2019 ఎన్నికల్లో నరసాపురం ఎంపీగా పోటీ చేసి ఓటమి చవి చూశారు.

పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా..

ఐనా నిరుత్సాహపడలేదు. ఫలితాలతో పని లేకుండా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. మొన్నటి ఎన్నికల్లో పిఠాపురం నియోజకవర్గంలో పవన్ విజయం కోసం, నాగబాబు ఇంటింటి ప్రచారం చేశారు. రాజకీయాల్లో తమ్ముడి వెన్నంటి నిలిచి, పార్టీ కోసం త్యాగం చేసిన నాగబాబుకు, ఇప్పుడు మంత్రివర్గంలో చోటు దక్కడం అభిమానుల్లో ఆనందాన్ని తెచ్చింది.ఇదిలా ఉండగా నాగబాబుకు మంత్రి పదవి రావడం వెనుక పవన్ కల్యాణ్ పక్కా ప్లాన్ ఉందనిరాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జనసేన ఆవిర్భావం నుంచి పవన్ కళ్యాణ్‌తో కలిసి నాగబాబు కూడా ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో నాగబాబుకు అనకాపల్లి ఎంపీ సీటు చివరి దాకా వచ్చి దక్కలేదు. అప్పటికే జరిగిన ఒప్పందాలు - ఒత్తిళ్లు నాగబాబుకు ఎంపీ సీటును దూరం చేశాయి.ఈ రోజుల్లో పదవుల కోసం జరిగే పోరాటాలు అందరికీ తెలిసిందే. అలాంటిది అందిన ఎంపీ పదవి చేజారిన నాగబాబు చింతించలేదు. తాను అధికార హోదాలు అనుభవించాలన్న కోరిక ఏ కోశానా లేదు అనేందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి. ఇవన్నీ పక్కన పెడితే కూటమి ప్రభుత్వంలో నాగబాబు కోసం అనేక పదవులు రెడీగా ఉన్నాయని టాక్ అయితే నడిచింది. కాని వాటన్నింటినా ఆయన కొట్టిపారిస్తూ వచ్చారు. కూటమి గెలుపు కోసం నాగబాబు ఎంతో చేశారు కదా ఆయనకు న్యాయం చేయాల్సిందే అన్న చర్చ సాగింది. ఇప్పుడు సడెన్‌గా నాగబాబుకు మంత్రి పదవి అంటూ చంద్రబాబు ప్రకటిచండంతో జనసేన నేతలు హ్యాపీగా ఫీలవుతున్నారు.

ఆడపాదడప సినిమాల్లో..

ప్రస్తుతం ఆడపాదడప సినిమాల్లో నటిస్తున్న నాగబాబు.. ఎక్కువ సమయం జనసేన పార్టీ కోసమే కేటాయిస్తున్నారు. సోషల్ మీడియాలో ఎప్పటిప్పుడు యాక్టివ్‌గా ఉంటూ.. ప్రత్యర్థులకు తనదైన శైలిలో కౌంటర్స్ ఇస్తున్నారు. నిత్యం కార్యకర్తలు, నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. పవన్ కళ్యాణ్ నిర్వహించే సభలకు ఏర్పాట్లను పరిశీలిస్తూ.. నాయకులను సమన్వయం చేస్తూ వస్తున్నారు.అయితే నాగబాబుకు ఏ శాఖను కేటాయిస్తారనే దానిపై త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. పవన్ కళ్యాణ్ కోరికతో పాటుగా.. జనసేన పార్టీకీ నాగబాబు అందించిన సేవలకు గాను ఆయన్ను కేబినెట్‌లోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. మరి నాగబాబు శాసనసభలోనూ శాసనమండలిలోనూ మెంబర్ కాదు కదా అంటే దానికీ దారి ఉంది అంటున్నారు. రానున్న ఆరు నెలల కాలంలో మండలిలో చాలా పదవులు ఖాళీ అయ్యే అవకాశముంది. అందులో ఒకటి నాగబాబుకు కన్ ఫర్మ్ అయినట్టే. అయితే దానితో సంబంధం లేకుండా ఈ మధ్యలో ఎపుడైనా నాగబాబు మంత్రి పదవి చేపట్టవచ్చు అని కూడా చెబుతున్నారు.మొత్తానికి మెగా ఫ్యామిలీ నుంచి నాగబాబు కూడా క్యాబినెట్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నారు. ఇప్పటికే పవన్ కళ్యాణ్ ఏపీ క్యాబినెట్‌లో కీలకంగా ఉన్నారు. అంతకుముందు మెగాస్టార్ చిరంజీవి యూపీఏ హయాంలో కేంద్ర క్యాబినెట్‌లో మంత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇలా మెగా బ్రదర్స్ ముగ్గురూ మంత్రి పదవుల్లో కొలుదీరినట్టు కానుంది.

# అమరావతి పనులకు ప్రభుత్వం ఆమోదం

అమరావతి, రాజధాని అమరావతిలో చేపట్టాల్సిన పనులకు ఆమోదం తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఆర్డీఏ ఆమోదించిన 20 సివిల్ పనులకు ఆమోదముద్ర వేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. రాజధాని పరిధిలో చేపట్టనున్న 20 సివిల్ పనులకు రూ. 11,467 కోట్ల మేర వ్యయం అవుతుందని ప్రభుత్వం పేర్కొంది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు సంయుక్తంగా ఇవ్వనున్న రుణంతో ఈ పనులు చేపట్టేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారులు, ఉద్యోగుల నివాస అపార్ట్‌మెంట్లు, ఐఏఎస్ అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నివాసాల నిర్మాణం పూర్తికి నిధుల విడుదలకు ఆమోదం తెలిపింది. న్యాయమూర్తులు, మంత్రులు, సీనియర్ ఐఏఎస్ అధికారుల బంగ్లాల నిర్మాణం కోసం నిధుల మంజూరుకు ఆమోదముద్ర వేసింది. ప్రభుత్వ కాంప్లెక్స్ నిర్మాణంలో భాగంగా సచివాలయ టవర్లు, అసెంబ్లీ, రాజధాని పరిధిలో మౌలిక సదుపాయాల నిర్మాణం కోసం ఈ నిధుల్ని వెచ్చించాలని నిర్ణయించింది. అమరావతిలో కొండవీటి వాగు, పాలవాగు వెడల్పు చేయటంతో పాటు శాఖమూరు, నీరుకొండ వద్ద రిజర్వాయర్ నిర్మాణం కోసం సీఆర్డీఏ రూ.1585 కోట్లు వెచ్చించనుంది. హ్యాపీనెస్ట్ ప్రాజెక్టులో భాగంగా 12 టవర్లుతో 1200 అపార్ట్‌మెంట్ల నిర్మాణం కోసం రూ.984 కోట్లు కేటాయించింది. రాజధాని పరిధిలో వరద నీటి కాలువలు, డ్రెయిన్లు, నీటి సరఫరా నెట్‌వర్క్, సీవరేజీ, యుటిలిటీ డక్టులు, పాదచారుల బాట, సైకిల్ ట్రాక్‌ల ఏర్పాటుకు నిధులు వెచ్చించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.



# రాజకీయ,పాలన ఇబ్బందులకు సర్కార్ చెక్..




హైదరాబాద్, రాష్ట్రంలో ప్రతి మండలానికీ ఐదుగురు ఎంపీటీసీలు తప్పనిసరిగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది. అందుకోసం ప్రస్తుత?అసెంబ్లీ సమావేశాల్లోనే చట్ట సవరణ చేసేందుకు కసరత్తు చేస్తున్నది. ఐదుగురు కంటే తక్కువ మంది ఎంపీటీసీలు ఉన్న మండలాల్లో రాజకీయంగా గొడవలు తలెత్తడం.. సర్వసభ్య సమావేశాలు నిర్వహించడం పెద్ద సమస్యగా మారింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 22 మండలాల్లో ముగ్గురు లేదా నలుగురు ఎంపీటీసీలు మాత్రమే ఉన్నారు. అందులో ఒకరు ఎంపీపీ మరొకరు వైస్ ఎంపీపీగా ఎన్నికైతే మిగిలిన సభ్యులతో సమావేశాలు నిర్వహించడం కష్టంగా మారింది. దీంతో తక్కువ ఎంపీటీసీలు ఉన్న మండలాల్లో కనిష్టంగా ఐదుగురు ఉండేలా సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

మండలాల పరిధి యథావిధిగా..

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 540 గ్రామీణ మండలాలు ఉండగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత మరో మూడు నుంచి నాలుగు మండలాలను ఏర్పాటు చేసింది. వీటికి త్వరలో ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధం అవుతున్నది. ఇందులో 22 మండలాల్లో మూడు లేదా నలుగురు ఎంపీటీసీలు మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం ఐదు కన్నా తక్కువ ఎంపీటీసీలు ఉన్న మండల పరిధిని యథావిధిగా కొనసాగిస్తూ, ఎంపీటీసీల సంఖ్యను పెంచనున్నారు. ప్రస్తుతం 3 నుంచి 4 వేల జనాభా ఉన్న ప్రాంతానికి ఒక ఎంపీటీసీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 3 వేల కన్నా తక్కువ జనాభా ఉన్న ప్రాంతాన్ని సైతం ఎంపీటీసీ నియోజకవర్గంగా చేయడం, అలాగే 5 వేల కన్నా ఎక్కువ జనాభా ఉన్న గ్రామానికి రెండు ఎంపీటీసీ స్థానాలకు పెంచాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తున్నది. ఆ మేరకు ప్రభుత్వం చట్ట సవరణ చేసేందుకు కసరత్తు చేస్తున్నట్టు సెక్రెటేరియట్ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది.

బీఆర్ఎస్ తప్పిదాలకు కాంగ్రెస్ చికిత్స

బీఆర్ఎస్ హయాంలో ఇష్టానుసారంగా మండలాలను ఏర్పాటుచేశారు. పాలన అవసరాలను దృష్టిలో పెట్టుకోకుండా, కేవలం రాజకీయ కోణంలోనే పలు కొత్త మండలాలను సృష్టించారని విమర్శలు ఉన్నాయి. మూడు ఎంపీటీసీలు ఉన్న మండలంలో ఎంపీపీ పదవి కోసం ఇద్దరు ఎంపీటీసీలు ఏకమైతే ఒకరు ఎంపీపీ, మరొకరు వైస్ ఎంపీపీ ఎన్నికయ్యేవారు. మిగిలిన ఒక ఎంపీటీసీ అంశాల వారీగా మద్దతు ఇచ్చేవారు. కొన్ని సార్లు సర్వసభ్య సమావేశాలకు సైతం డుమ్మా కొట్టేవారు. నలుగురు ఎంపీటీసీలు ఉన్న మండలాల్లోనూ ఇదే అనిశ్చితి ఏర్పడేది. అందుకే.. ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకొస్తున్నది. చట్ట సవరణ చేస్తే అటు పాలన, ఇటు రాజకీయ వివాదాలకు చెక్ పెట్టొచ్చని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్నది.

## జడ్పీటీసీ నుంచి రాజ్యసభ వరకు బీద ప్రస్థానం

బీద మస్తాన్‌రావు నెల్లూరు జిల్లాకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త. బీఎమ్మార్‌గా ప్రసిద్ధుడైన ఆయన రొయ్యల వ్యాపారంలో ఉన్నారు. 1958 జులై 2న జన్మించారు. బీసీ వర్గానికి చెందిన ఆయన... మొదట చెన్నైలోని ఒక హోటల్ గ్రూప్‌లో ÷నాన్షియల్ మేనేజర్‌గా పనిచేశారు. అనంతరం రొయ్యల వ్యాపారంలో ప్రవేశించి అంచెలంచెలుగా ఎదిగారు. 2001లో రాజకీయాల్లోకి ప్రవేశించిన ఆయన బోగోలు మండలం నుంచి జడ్పీటీసీ సభ్యుడిగా తెదేపా

# ర్యాగింగ్‌పై కఠిన చర్యలు చేపట్టండి..

హైదరాబాద్,గుజరాత్ జీఎన్ఈఆర్ఎస్ వైద్య కళాశాలలో ర్యాగింగ్ భూతానికి ఓ ఎంబీబీఎస్ విద్యార్థి మృతి చెందాడు. వసతి గృహంలో సీనియర్లు మూడు గంటలపాటు నిలబెట్టడంతో కోమాలోకి మృతి చెందిన కేసు నమోదైంది. ఈ నేషనల్ మెడికల్ కమీషన్ దేశంలోని మెడికల్ కాలేజీలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. అయితే, గ్రౌండ్ లెవల్ కట్టుదిట్టమైన చర్యలు అమలులోకి వచ్చాయి, ఇలాంటి ఘటనలు పెరుగుతున్నాయని కమిషన్ చైర్మన్ మెడికల్ కాలేజీలకు రాసిన లేఖలో పేర్కొన్నారు.గత కొంతకాలంగా పలు నివేదికల ద్వారా ర్యాగింగ్‌కు సంబంధించిన ఫిర్యాదులు అందుతున్నాయని. అన్ని ప్రభుత్వ, ప్రయివేటు వైద్య కళాశాలలు ర్యాగింగ్ ఫిర్యాదులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని కమీషన్ చైర్మన్. గుజరాత్‌లోని ధర్‌పూర్ మెడికల్ కాలేజీలో జరిగిన ఘటన చాలా దారుణమని చైర్మన్ డాక్టర్ విజయ్ ఓజా పేర్కొన్నారు. ఇలాంటి ర్యాగింగ్ ఘటనలు విద్యాసంస్థల ప్రతిష్టను దిగజార్చుతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. మానసిక వేధింపులు, ఆత్మహత్యలకు దారితీసే కేసులు ఉన్నాయని చెప్పారు. ఎన్ఆర్ఆక్ట్‌ర్యాగింగ్ సెల్, యూజీసీ యాంటిస్ట్ ర్యాగింగ్ హెల్ప్‌లైన్‌తో పాటు వివిధ మార్గాల ద్వారా ఈ ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు.ఇటీవల గుజరాత్ ధర్‌పూర్‌లోని జీఎంఈఆర్ఎస్ వైద్య కళాశాలలో ర్యాగింగ్ 18 సంవత్సరాల వైద్య విద్యార్థి మృతి చెందాడు. వసతి గృహంలో




సీనియర్లు మూడు గంటలపాటు నిలబెట్టడంతో మొదటి సంవత్సరం విద్యార్థి అనిల్ మెథానియా అచేతన స్థితిలోకి వెళ్లి మరణించాడని ఎఫ్ఐఆర్ నమోదైంది. వాళ్లు మమ్మల్ని మూడు గంటలపాటు నిలబడి పరిచయం చేసుకోవాలని, ఆందోళన చేయకూడదని ఒత్తిడిచేశారని.. చివరికి మాతోపాటు నిలబడిన ఓ విద్యార్థిని.. మేం అతడిని వెంటనే దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికే చనిపోయాడని వైద్యులు ప్రకటించారు. ఈ ఉంది 15 మందిపై కేసు నమోదైంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com